వెంకట్రావు హుషారుగా ఈలవేసుకుంటూ మెస్టాక్కీ కాలేజీ లైబ్రరీహాలు ప్రవేశించాడు. ద్వారందగ్గర కాసేపు నిలబడి హాలంతా కలయజూచాడు. వోమూల "విషాద సారంగధర" పోజులో కూర్చున్న మధుసూధనరావు అతడికి కనిపించాడు. వెంటనే రెట్టించిన హుషారుతో యీలవేసి బిరబిరా అతడి దగ్గరకు నడిచాడు.

"లేరా! నాన్నా హాస్టలుకెడదాం" అన్నాడు మిత్రుడిని సంబోధిస్తూ. మధుసూధనరావుమటుకు చెంపకు చేయి ఆనించుకుని మెదలకుండా అలాగే కుర్చీలో కూర్చున్నాడు.

మిత్రుడి ఈ ప్రవర్తన వెంకట్రావులో ఆశ్చర్యాన్ని కలిగించింది. కణకణలాడుతున్న నిప్పు కణికెల్లో చెంబెడు చన్నీళ్ళుపోసినట్లు అతడి ఉత్సాహమంతా చల్లారిపోయింది. అనుమానంగా మిత్రుడి మొహంలోకి చూశాడు.

"ఎన్నడూలేంది ఈ పూట యీ విషాదయోగానికి కారణమేవిట్రా?" అని నేరుగా వాడినే అడిగేశాడు. మధుసూదనరావు వెంటనే మాటాడలేదు. కాసేపుండి గట్టిగా నిట్టూర్చాడు. మరి కాసేపటికి మెల్లగా "ఒరే వెంకట్! నాపని అయిపోయిందిరా!" అన్నాడు.

"అంటే?" వెంకట్రావు ప్రశ్నించాడు పటిష్టంగా.

"ఓ ప్రేమ వ్యవహారంలో యిరుక్కొని గొంతుక్కితెచ్చుకున్నానురా? నాశనయిపోయింది! ప్చ్" అన్నాడు, ఆత్మానుకంపాపూరితుడై విచారంగా నిట్టూరుస్తూ.

"విశదంగా చెప్పరా!" కాస్త విసుగుతో అన్నాడు వెంకట్రావు. మధుసూదనరావు గుండెలనిండా వూపిరి పీల్చుకుని లెక్చరు కొట్టబోయ్యేవానికి మల్లే ఆరంభించాడు : "థర్డియర్ కెమిస్ట్రీ స్టూడెంటు లేదూ సుధారాణి. . . . . ."

గంగాప్రవాహానికి ఆనకట్టలా వెంకట్రావు అడ్డొచ్చాడు : "నాకు పేర్లు సరిగా గుర్తుండవులే. ఇంతకీ నువ్వనేది ఆ రెండు. . . ."

ఈసారి బియాస్‌నదికి భాక్రానంగల్‌లా మధుసూదన్ అడ్డుపడ్డాడు : "కరెక్టురా ! నేననేది ఆ రెండు జడల అమ్మాయి గురించే! సన్నగా పొడుగ్గా వుండి కళ్ళకు కాటుక పెట్టుకొని వుంటుందే, ఆ కోలమొహం అమ్మాయి! ఆమే మిస్ కే. సుధారాణి థర్డియర్ బి.యస్సీ కెమిస్ట్రీ. ఆమెనుచూసిన దగ్గర్నుంచీ నా బ్రతుకిలా అయిపోయిందిరా!" అన్నాడు.

వెంకట్రావు కాసేపు ఆలోచించాడు : "అసలు ఆ పిల్లెక్కడో నాకు కనబడ్డంలేదు. ప్రేమలోపడ్డ వాడివి హుషారుగా పాటలుపాడుతూ ఊరంతా చక్కర్లుకొట్టక "మాసిన చీర కట్టుకొని మౌనముతోడ నిరస్తభూషయై. . . "అన్నట్టుగా ఈ అవతారం ఎత్తావేమిటి?" వెంకట్రావుది తెలుగు మెయిన్ కాబట్టే అతడి నోట్లోంచి తెలుగు కొటేషన్లు దొర్లుతుంటాయి అప్పుడప్పుడూ.

"కాదురా ! చాలా క్లిష్ట పరిస్థితుల్లో వున్నాను. నీవే సహాయం చేయాలి. నీవిూదే నా ఆశలన్నీ పెట్టుకున్నాను. ఎలా కడతేరుస్తావో ఏమిటో!"

# మధుపత్రమ్

(33-వ పేజీ తరువాయి)

వెంకట్రావులో చల్లారిన ఉత్సాహం తిరిగి పుంజుకుంది. "చాలించు ఈ నిస్సహాయుని నిరాశాగీతం. నిన్ను నిర్ఘాంతభీతుడను చేస్తాను. కర్మక్షేత్రంలో విషాదయోగం వీడి అసలు విషయం విన్నవించు" అని మిత్రుడికి ముదల యిచ్చాడు వాడివీపున ఓ చరుపున్నా ప్రసాదించాడు.

"ఈ సుధారాణి అనే అమ్మాయి నన్ను ప్రేమిస్తుందో లేదో తెలుసుకుందామని . . . ." మధుసూదనరావు ఆరంభించాడు

"చాలు, చాలు! అర్థమయింది నీ బాధ" హస్తం పైకెత్తి వెంకట్రావు అన్నాడు "ఎంతసేపు? ఈ చిన్న విషయం తెలుసుకోవటానికి అర్థపూట చాలును!"

"అదికాదు! నే చెప్పేది విను ఆమె నన్ను లవ్ చేస్తుందో లేదో తెలుసుకుందామని ఓ లవ్ లెటర్ వ్రాశానురా !" అన్నాడు మధుసూదనరావు. వెంకట్రావు ఈ సంగతి విని బోలెడు సంతోష పడిపోయాడు "వెరీగుడ్ మై బోయ్! వెరీగుడ్! అని మనఃపూర్వకంగా మిత్రుణ్ణి అభినందించి 'సదరు ప్రేమలేఖను కుమారి సుధారాణి కరకమలాల్లో సమర్పణ చేసేవుంటావు ఔనా?" అని ప్రశ్నించాడు

"లేదు. . " అన్నాడు మధుసూదన్. వెంకట్రావు ఆశ్చర్యపోయాడు. ఇటువంటి జవాబు వస్తుందనుకోలేదు మరింత ఆశాజనకమయిన కథనే వినవచ్చని అనుకున్నాడు. కాని అతడి బుర్రలో చటుక్కున ఓ ఆలోచన మెరపుతీగెలా మెరిసింది. 'ఒహో! తెలిసిందిలే !! తిరస్కృతప్రేమ గాథన్న మాట! ఆ లేఖను తీసుకోనని సుధారాణి మొరాయించిందా?" అని అడిగాడు

"కాదురా!" అన్నాడు మధుసూదన్. ఈసారి వెంకట్రావు మరో తెలివయిన వూహని బయట పెట్టాడు "ఈరోజు ఆ అమ్మాయి కాలేజీకి రాలేదంటావు అంతేకదూ!"

"అదికాదోయ్ వెర్రినాయనా! నేను ప్రేమలేఖని వ్రాసి, దాన్ని జాగ్రత్తగా ఓ పల్చని కవర్లోవుంచి ఆ కవర్ని వో పుస్తకంలోవుంచి ఆమెకిద్దామని కాలేజికి తెచ్చాను . . . " పారంలా చెప్పుకుపోతున్నాడు మధుసూదన్ వెంకట్రావు బుర్ర మళ్ళీ చురుగ్గా పనిచేయ నారంభించింది "కాని తీరా సమయానికి వణకు పట్టుకోవడంవల్ల దాన్ని ఆమెకు ఇయ్యలేకపోయానంటావ్?" ఇది వెంకట్రావు క్రొత్త వూహ

"అదికాదురా!" మధు జవాబు

"సరిసరి! అలాచెప్పు. ఇప్పుడర్థమయింది ఇది రెకమెండేషన్ల యుగం. నీ తప్పేముంది? ఉత్తరం నేరుగా నేవే యివ్వడం బావుండదని నీ తరఫున నన్నే వెళ్ళి ఆ ఉత్తరాన్ని ఇమ్మంటున్నావ్. అంతేనా ?"

"చస్ ! అదికాదంటుంటే . . . ."మధు గట్టిగా అరిచాడు వెంకట్రావుకి విసుగెత్తింది. "మరేవిట్రా నీ బాధ ?" అనడిగాడు

"ఏవిటో నీ సొదేగాని నే చెప్పేది కాస్తయినా వినిపించుకోవు" మధు చీవాట్లేశాడు. "సరే సరే! తొందరగా అసలు విషయం చెప్పు. నేనిక మాటాడనులే!" అన్నాడు వెంకట్రావు కుతూహలంగా

"ప్రేమలేఖని వో కవర్లోవుంచీ, ఆ కవరును వో పుస్తకంలో వుంచానని చెప్పానా ? ఆ పుస్తకాన్ని అన్ని పుస్తకాలతోపాటు కాలేజికి తెచ్చాను. కాని ఇప్పుడా పుస్తకం కనబడ్డంలేదు" అన్నాడు మధు విచారంగా

ఆయుధాగారంలో ఒక హైడ్రోజన్‌బాంబు లెక్కకు తక్కువ వస్తోందని తెలిసిన సైన్యాధికారి "వ్వాట్!" అని గట్టిగా అరచి ఆరంగుళాలు మీదికెగిరి పడ్డాడో లేడో మనం నిర్ధారణగా చెప్పలేం కాని వెంకట్రావు మాత్రం సరిగ్గా అలానే ప్రవర్తించాడు.

మధు మరింత ఫోర్సుగా చెప్పాలనే ఉద్దేశ్యంతో "అవున్రా నిజం! యా. . . స్!" అన్నాడు

వెంకట్రావు అనుమానంగా "ఎవరూ?" అని అడిగాడు

---

మొదటి వాడు:- యమధర్మ రాజుకి డాక్టరుకి తేడా ఏమిటండీ? చెప్పగలరా.

రెండవ వాడు:- యమధర్మ రాజు మనిషి ప్రాణం ఒక్కటే తీసుకు పోతాడండి. డాక్టరయితే మనిషి ప్రాణం, ఫీజూ కూడా తీసుకెడతాడండి.

మైలవరపు వేంకటయజ్ఞేశ్ బాబు
(పెద్దాపురం)

---

మధు "వెవరేమిటి నీతల! యా స్ అంటే అవును అన్నమాట. నేననేదేవిటంటే ఆ పుస్తకం ఇప్పుడు కనబడ్డంలేదు!" అన్నాడు.

వెంకట్రావు వో ముఖ్యమైన క్లూ కనుకున్నవాడిలా "మరి దానిలో కవరేమైంది ?" అనడిగాడు.

"అదీ కనబడ్డంలేదు, దానిలోని ప్రేమలేఖ కూడా కనబడ్డంలేదు" అని విశదీకరించాడు మధు

"అంటే నీ పుస్తకమూ, దానితోపాటు నీ ప్రేమలేఖా పోయినాయన్నమాట" అని ఒక కంక్లూషన్‌కి వచ్చాడు వెంకట్రావుది తెలుగు మెయిన్ అయినా అతడికి శాస్త్రీయమైన మెదడు వుంది అన్నీ తేటతెల్లంగా ఆలోచించి కచ్చితమైన తీర్మానాలు చేస్తాడు. "ఇంతకీ నువ్వాకవర్ని ఏ పుస్తకంలో వుంచావు?" అనడిగాడు

"ఒక లైబ్రరీ పుస్తకంలో వుంచాను దాని పేరు "హంపీ కన్యలు" చలంగారు రాసిన నవల" మధు చెప్పాడు.

"ఆఖరుసారిగా నీవు ఈ హంపీకన్యలు అనే పుస్తకాన్ని ఎక్కడ చూశావు?" హిచ్‌కాక్ సినిమాలో లాటక్‌పోజులో అడిగాడు వెంకట్రావు

"దాన్ని తిరిగి లైబ్రరీలో ఇచ్చేదామని తెచ్చాను. మొదటి పీరియడ్ అయిపోయాక పుస్తకాలు క్లాసులోనేవుంచి అలా కెమిస్ట్రీ లాబ్‌వేపు చక్కర్లు కొట్టొద్దామని వెళ్ళాను తిరిగివచ్చేసరికి పుస్తకం లేదు!"

"మీ క్లాసులో వాకబు చెయ్యలా?"

"చేశాను తేలిందేమంటే నా బెంచిమేటు రవీంద్రనాథ్ తానే నా లైబ్రరీ పుస్తకాన్ని తీసికెళ్ళి లైబ్రరీలో ఇచ్చేశాట్ట అదీ విషయం"

వెంకట్రావు అనుమానంగా వాడే తీశాడేమో కవర్ని?" అనడిగాడు

"వాడు తీయలేదట. ఎలావున్న పుస్తకాన్ని అలా తీసికెళ్ళి లైబ్రరీలో ఇచ్చేశానన్నాడు."

"నిజమేనా ?"

"నిజమే అయివుంటుంది " ముఖ్యమైన కవరురా బాబూ! నిజం చెప్పరా!" అని బ్రతిమాలాను ఏడుపుమొహంపెట్టి "నే తియ్యలేదురా మధూ! నీతోనా అబద్ధం ఆడేది!" అన్నాడు "

"ఇంతకీ వాణ్ణి చీవాట్లేశావా, లేదా ?"

"మొహం వాచిపోయింది" వెంకట్రావుకి ఇదొక సంతృప్తి నిచ్చింది ప్రఖ్యాత డిటెక్టివులందరి వలెనే, అపరాధికి తగినశిక్ష పడాలని అతడి అభిప్రాయ ప్రాయం

"సరే! అయితే ఇంకా ఆలస్యందేనికి? ఆ పుస్తకం లైబ్రేరియన్ దగ్గరే వుంటుంది పోయి అడిగి దాన్ని తీసుకొని, దానిలోని కవర్ని తీసుకొని వచ్చేయ్!" అన్నాడు

మరోసారి మధు నిట్టూర్చాడు "అంత సులభమైన వ్యవహారంకాదురా! పుస్తకం ఇమ్మని ఆయన్ని ఇందాకే అడిగాను కాని ఆయన నాకలం పోయిందనే భ్రమలో వున్నాడు!"

"అధైర్యపడకు ! నేను ఆయనకు వినబడేట్టు చెబుతాగా!" అని వెంకట్రావు మధుని లైబ్రేరియన్ వద్దకు తీసుకొని వెళ్ళాడు ఇద్దరూ ఆయన టేబిల్‌వద్దకు వెళ్ళేసరికి ఆయన ప్రశ్నార్థకంగా వీరివంక చూశాడు

"ఉదయం పుస్తకాలిచ్చేకాలం దాటిపోయిందండీ! అన్నాడు లోగొంతుకలో

"అజంతా కన్యలు కావాలండీ!" అన్నాడు వెంకట్రావు కొంచెం గట్టిగా

"అదికాదు, అదికాదు" మధు సరిదిద్దబోయాడు

"ఓ అయాంసారీ! నాకు పేర్లు సరిగా గుర్తుండవు "హరప్పా కన్యలు" కావాలండీ !" అన్నాడు వెంకట్రావు తిరిగి లైబ్రేరియన్‌తో

"హరప్పాకాదు హంపీ" అని సరిదిద్దాడు మధు.

"ఔనౌను హంపీకన్యలు హంపీ కన్యలు కావాలి" అన్నాడు గట్టిగా లైబ్రేరియన్ జాగ్రత్తగా ఈ మాయినిని పాంపేస్ కింగ్‌డమ్ ఇష్యూలో వుందండీ" అన్నాడు జవాబుగా

"కాదు, కాదు" వెంకట్రావు చేతో సంజ్ఞ చేశాడు "హంపీకన్యలు కావాలి" అని గట్టిగా చెప్పాడు.

"కన్నయ్య ప్రిన్స్‌పాల్‌గారి రూంకెళ్ళాడు"

వెంకట్రావు ఈసారి చేతో్త మధుసూదనరావును చూపాడు "ఈయన తెచ్చిన హాంపీకన్యలు కావాలి!" అన్నాడు తారస్థాయిలో. "ఆయన కలం నే చూడ లేదు" అనే క్లుప్తమైన జవాబు వచ్చింది వెంకట్రావు గొంతుకెండిపోయింది కొద్దిగాదగ్గి ఒక్కొక్క అక్షరమే చెబితే ఆయనకు వినబడుతుందేమోనని 'గు—డి—పా—టి— వెం—క—ట—చ—లం వ్రాసినది" అన్నాడు వినబడిందో లేదో తెలుసుకుందామని ఆశగా అతడివంక చూశాడు మళ్లీ ఒకసారి చెప్పాడు: "గుడిపాటి"

"నిడుపాటి . . . .ఓహో నిడుపాటిదంటారా!" అన్నాడాయన పాపం పెద్దకలమేపోయిందే అన్న సానుభూతితో

"వెంకటచలం. . . . . .వెంకటచలం . . . " అన్నాడు వెంకట్రావు అదన్నా వినబడుతుందేమోనని

"పైలట్‌కలం. . . .పైలట్‌కలం. . . .చాలా ఖరీదే వుంటుంది. ప్చ్!!" అని పెదవి విరిచాడాయన

వెంకట్రావు జేబురుమాలుతో చెమటపట్టిన నుదురును తుడుచుకున్నాడు. "ఒరే మధూ! దాహమేస్తోందిరా! కాంటీన్‌కెళ్దాం పద" అన్నాడు బొంగురు గొంతుతో ఇద్దరూ కాంటీన్‌వేపు దారి తీశారు. వెంకట్రావు రెండు గ్లాసుల నీరు త్రాగాక "ఏం చెద్దామంటావురా?" అని మధు ప్రశ్నించాడు వెంకట్రావు "ఏంచేసీలాభంలేదు వూరుకుందాం!" అన్నాడు

"ఊరుకుంటే ఎలారా? ఆ ఉత్తరం ఎవరి చేతుల్లోనన్నాపడితే ఏవన్నావుందీ? నా పరువు పోదూ! పైగా ప్రిన్సిపాల్ చేతిలోగాని, లెక్చరర్ల చేతుల్లోగాని పడిందంటే ఇక మనకి శ్రీముఖమేరా! నన్నీ కాంపౌండులోనికి రానియ్యరు!" అన్నాడు మధు

వెంకట్రావుకి బోల్డు కోపమొచ్చేసింది స్నేహితుడికోసం తనుపడిన శ్రమంతా బూడిదపోసిన పన్నీరయింది. ఈ సంగతి తెలుసుకొని అతడు మండిపడిపోయాడు. "చస్! తెలివితక్కువ వెధవ్వి! లవ్‌లెటర్లట! లవ్ లెటర్లు! రాసేవాడివి కాస్త జాగ్రత్తగా యాడవరాదూ! ఇప్పుడెలా చావాలనుకున్నావ్? చూశావుగా నీకోసం తంటాలుపడితే ఏమైందీసి" అని చడా మడా వాగేశాడు.

"నామీదెగుర్తావేరా? నేనేం చేశాను? నా పుస్తకం ఆ సన్యాసి తీసుకెళ్ళాడా! ఆయనేమో పొడవాటికలమంటున్నాడా? పోనీకదాని నీతో చెబితే నీవు నామీదే ఫైరయిపోతుంటివాయెను! ఇక నేనెలా మొత్తుకోవాలి?" అన్నాడు బిక్కమొహమేసి మధుసూధనరావు

ఎందరో కవులు స్నేహాన్ని గురించి గొప్పగా వర్ణించారు క్షీర నీరాల స్నేహంలా మహాత్ముల మైత్రి వుంటుందని భర్తృహరి నుడివాడు పేద మిత్రుడు సమాదరంతో సమర్పించిన పిడికెడు అటుకులను పాయసంలా ఆప్యాయంగా తినేట్టు చేయగలిగింది కృష్ణ కుచేలుర మధ్యగల స్నేహమేనని అందరకూ తెలుసు స్నేహం గురించి చెబుతూ గురజాడవారు "ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును, ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును" అన్నారు.

"సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్!" అన్నారు బసవరాజు అప్పారావుగారు (లేక అడివి బాపిరాజుగారా?) ఏమైనా, బాపిరాజుగారు (బసవరాజుగారా?) చెప్పినమాట మహా సత్యమైనదని మన మందరమూ అంగీకరిస్తాం వాగర్థములవలె రెండు ఆత్మలొకటిగా సంపృక్తమై, క్రూరమకరనికర దుర్వార చలదూర్మికాగహనమైన వార్నిధిని తరింపజేసి, మానవుని ఔన్నత్యాన్ని దీర్ఘీకరించి "మనుష్యుడిల మహానుభావుడే" అనిపింపజేసేది యీ స్నేహమే! దానిలో ఏమీ సందేహంలేదు

మధు బిక్కమొగమేసేసరికి వెంకట్రావు కరిగిపొయ్యాడు అనునయంగా "కాదురా! మరి ఇల్లాంటి పనులు చేసేవాడివి కాస్త జాగ్రత్తతో చేయొద్దూ! నీవే ఆలోచించు. . . . ఇంతకీ అంత ప్రమాదకరమైన విషయాలేం రాశావు ఆ జాబులో? ఏదీ దాని నకలుంటే ఇవ్వు చూద్దాం!" అనడిగాడు.

"కాపీ లేదురా!" అన్నాడు మధు. వెంకట్రావుకి తిరిగి చిరుకోపమొచ్చింది "ఛ! ఛ! నువ్వన్నీ యింతేరా! లవ్‌లెటర్ వ్రాసేవాడివి దాని కాపీ ఒకటి నీ దగ్గరుంచుకోవద్దూ! కాస్తయినా తెలివిలేదు నీకు!" అని వాగేశాడు ఈ దెబ్బకి మధుసూదన్‌కి కూడా కోపం వచ్చేసింది "కాపీలు వుంచుకోవడానికి నేనేవీ ఫైళ్ళకొద్దీ లవ్ లెటర్లు వ్రాసేస్తున్నాననుకున్నావా? నా జన్మలో వ్రాసిన మొదటి ప్రేమలేఖ యిదే! అది నాకు కంఠతా వచ్చినప్పుడు కాపీ వుంచుకోవాల్సిన అవసరమేముంది?" అన్నాడు

"అయితే అదేదో తొరగా చెప్పి ఏడు ఎందుకైనా మంచిది!" అని శాసించాడు వెంకట్రావు ఈ మాటవిని మధు సిగ్గుపడ్డాడు.

"హారినీ అసాధ్యం!! చెప్పడానికింత సిగ్గయితే కాయితమ్మీదరాసి తగలెట్టు చదువుతాను" అన్నాడు వెంకట్రావు. మధు అంగీకరించి వో కాయితంచింపి దానిమీద ప్రేమలేఖ తాలూకు కాపీ రాసిచ్చాడు వెంకట్రావు దాన్ని అందుకొని ఇలా చదివాడు

"మైడియర్ సుధారాణి,

మీ మధుర వదనారవిందాన్నిచూచి ధృతిచెదరి నామది నాలో అవధుల్లేకుండా అల్లరిచేస్తోంది. మీ ఎదురుగా నా కథనాన్ని వినిపిద్దామనుకుంటే వెధవది నా హృది ఒకటే దడదడలాడుతోంది. పదార్వన్నె సువర్ణంతో మధువును రంగరించి విధాత మీతనూలతను సృజింపాడు మీ అధరంలోని అరుణిమగానీ, మీ సోగ కనుల సోయగంగానీ నాకు దివ్యసందేశాలనే అందిస్తున్నాయి. జీవితపథంలో నిరాధారంగా పయనించేపాంథుణ్ణి నేను. నా జీవిత రథానికి సారధిగా వుండటాని కంగీకరిస్తారేమోనని ధైర్యంచేసి యీవిధంగా వ్రాస్తున్నాను. జవాబిస్తారుకదూ!

మీ మధు"

ఈ ఉత్తరాన్ని సాకల్యంగా, సావకాశంగా సవిమర్శనంగా మైమరచి చదివి ఏదో చెబుదామని వెంకట్రావు నోరు తెరిచాడు. అదే క్షణంలో—

రివ్వున గాలి వీచింది. రెమ్మలనుండి అనిలావర్తితములైన కుసుమాలు ఎగురుకుంటూ ఎలా వెళ్లతాయో అలాగే వెంకట్రావు చేతిలోనుండి కూడా ఆ ఉత్తరం తొలగిపోయి గాలిలో ఎగురుకుంటూ కాంటీన్ కిటికీగుండా అవతల కెమిస్ట్రీ లాబ్‌వద్దకు పోయి పడింది.

* * *

మిత్రులిద్దరూ ఆశ్చర్యంతో నిశ్చేష్టులై ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. పరిసర పరిజ్ఞానం కలిగాక ఇద్దరూ పరిగెత్తుకుంటూ కిటికీవద్దకు వెళ్ళారు. అవతల కెమిస్ట్రీ లాబ్ చుట్టుపక్కల ఓ చిన్నకాయితమ్ముక్కయినా వారికి కనబళ్లేదు. జనసంచారం కూడా ఎక్కడా లేదు. లాబ్ హాలు గోడ కానుకుని ఓ గార్దభరాజంమాత్రం ఈ ప్రపంచంతో ఏ సంబంధమూ లేనట్టు నిశ్చింతగా నిలబడి నిద్రపోతోంది.

"ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు మధు సర్వనాశనమైన 'కింగ్‌లియ్యర్'లా. కష్టాలొచ్చాయంటే వందలకొద్దీ వస్తాయని పెద్దలు చెప్పనే చెప్పారు కదా!

మధు ఆందోళన గమనించి వెంకట్రావు అన్నాడు: "ఒరే! వూరికే గాభరాపడకు. ఆపదలందు సముంచితధైర్యగుణంతో వుండడం ధీరోదాత్తుని లక్షణాల్లో ఒకటని ఈరోజే మా ప్రొఫెసర్ చెప్పాడు. అసలు నువ్వు రెండు లవ్ లెటర్లు పోయాయే అని బాధపడకూడదు. ఈ రెండవదివెళ్ళి మొదటిదాన్ని వెతుక్కొస్తుందని తలంచుకొని గుండె దిటవు చేసుకోవాలి ఇక ఇది క్లిష్టపరిస్థితి కాబట్టి సర్వాధికారాలూ నేను వశపరచుకుంటున్నాను. నువ్వు నేను చెప్పినట్టల్లా చెయ్యి ముందు లైబ్రేరియన్ దగ్గర కెళ్ళి 'హంపీకావ్యము' అనే పుస్తకం ఎక్కడుందో కనుక్కొనిరా!. . . . ."

"హంపీకన్యలు" అని సరిదిద్దాడు మధు.

"అదే "హంపీకన్యలు" కాని ఇంతకుముందు వలె ఇప్పుడు నీవు కష్టపడవలసిన అవసరంలేదు.

(39 వ పేజీ చూడండి)

---

మొదటివాడు :- ఏమండీ మహాశయా! తమకు మీ అబ్బాయి ప్లీడరు కావలెనని ఎందుకు కోరడం? ఏ మాస్టరుగానైనా చేస్తే బాగుంటుందే?

రెండవవాడు :- నిజమే సోదరా! కాని మావాడికి చిన్నప్పటినుండీ అబద్ధమాడడం అలవాటు. అందుచేత వకీలుగా తయారుచేయడం మంచిదనిపించింది నాకు.

మైలవరపు వేంకటయజ్ఞేశ్ బాబు
(పెద్దాపురం)

---

నాకో అయిడియా తట్టింది ఆయనకు వినబడదు గాని చదవగలడుగా! కాబట్టి వెళ్ళి త్వరగా తెలుసు కొనిరా! ఇంతలో నేను ఇప్పుడెగిరిపోయిన కాయితం గురించి ఆలోచిస్తుంటాను'' అన్నాడు వెంకట్రావు

"అద్భుతంరా వెంకట్! అద్భుతం! నీ బుర్ర ఇంత చురుగ్గా—ఇంత క్లిష్ట సమయంలో పని చేస్తుం దనుకోలేదు!'' మిత్రుణ్ణి మెచ్చుకుంటూ మధు నిష్క్రమించాడు

వెంకట్రావు సాలోచనగా కిటికీలోంచి ఆవలకు చూశాడు ఆ చుట్టుపట్ల ఎక్కడా కాయితం అన్న జాడే కనబట్లేదు వెంకట్రావు బుర్రలో ఓ ఆలో చన మెరిసింది సైంటిఫిక్ అయిడియా కెమిస్ట్రీ లాబ్‌కదూ అది దాని చుట్టుపట్లవుండే వాయు వంతా ఆమ్లంతో నిండివుంటుంది. కాబట్టి కాయితం ఆ వాయువులో కరిగిపోయివుంటుంది ఎంత సైంటి ఫిగ్గావున్నా ఈ నిర్ణయం అంత సమంజసంగ కనిపించలా తీక్షణంగా చూశాడు హాలుప్రక్కగా గార్దభరాజం అలాగే నిలబడి నిద్దరోతోంది దానిని చూస్తేవుంటే అతడి మనసు పరిపరివిధాల పరుగ లెత్తింది. కాని . . బుజువెలా?

మధు తిరిగొచ్చాడు. "ఒరే వెరీసారీ! హంపీ కన్యలు అప్పుడే చేతులు మారిందట! నా ప్రేమ లేఖ ప్రపంచంలో ప్రవేశించిందిరా!!''

"నీవేం భయపడకు. నాకు ఇంకొక వూహ తట్టింది. సెకెండ్ జూ ఆలజీలో మధుమూర్తి అని ఒకడున్నాడు కాబట్టి నిన్నెవ్వరూ అనుమానించరు ఇంతకీ ఆ పుస్తకాన్ని ఎవరు తీసుకున్నారట?''

"ఫోర్తియర్ మాథమాటిక్స్ స్టూడెంటు యస్ రామ్మూర్తి తీసుకెళ్లాడట మెయిన్ బ్లాకులో వుంటాడే వాడేననుకుంటా !'' అన్నాడు మధు

"ఒరే మధూ! ధైర్యం చిక్కబట్టుకో, కష్టా లొకదానివెంట ఒకటి వస్తాయంటే ఇదే! ఆ రామ్మూర్తి సంగతి నువ్వెరగవులే! వాడి బుద్ధి ఎంత వంకరయిందంటే, అది చూశాక కొంగమెడ తిన్నగా కనబడుతుంది కర్ణుడు, శిబి వగైరా దాతలు జన్మించిన దేశంలో వీడంత స్వార్థపరుడెలాపుట్టాడో తెలియకుండావుంది వాడి దగ్గరకెళ్ళి 'ఒరే! నీ పుస్తక మొకమాటివ్వరా! చదివి ఇచ్చేస్తాను' అని అడిగావనుకో! వాడి ప్రాణంపోయినా దాన్ని యివ్వడు పైగా ఏ పుస్తకం తీసుకుపోతావోనని అన్నిటినీ అలమారులోపెట్టి గాడ్రెజుతాళం వేసుకుంటాడు వాడు సామాన్యుడుకాదు'' అని ఏకరువుపెట్టాడు వెంకట్రావు

"మరేం చేద్దామంటా విప్పుడు?''

"నాకొక అయిడియా తడుతోంది ప్రసాద రావు రూము కెళ్దాం రా!''

"వాడి రూముకెందుకూ?''

"వాడిదగ్గర వో విరుగుడుంది అదేమిటో నాకు తెలీదనుకో ఉందనిమాత్రం తెలుసు వెళ్దాం రా!''

ఇద్దరూ బయటికొచ్చారు దూరంగా కాలేజి నుండి అమ్మాయిల బృందం వస్తోంది వారిని చూడగానే మధు వెంకట్రావుని మోచేత్తో పొడి చాడు "ఒరే చూడు! కథానాయికి వస్తోంది''అన్నాడు మెల్లగా వెంకట్రావు తల పంకించాడు.

(37-వ పేజీ తరువాయి)

ఆ అమ్మాయిల్లో వో రెండు జడలమ్మాయి మధుని వోరగంటచూసి తనలో తానే మెల్లగా నవ్వుకొంది. తన చేతిలో పుస్తకాలని సర్దుకొని మళ్ళీ నవ్వింది. అందరూ ముందుకు సాగిపోతుండగా ఆమె వెనుదిరిగి వోసారి మధు వంకకి చూసింది.

"ఒరే చూశావుట్రా! ఆ క్రీగన్నులలోని కాంతి! జలదనీలాలైన ఆ నయనాలలో విద్యుల్లతలా మెరిసి పొయ్యే సౌందర్యం!''

"పూర్వకాలం రోమ్ నగరపు రాజు నీరో....'' మొదలెట్టాడు వెంకట్రావు.

"అబ్బ చాలిద్దూ నీగోల! ఆమె సౌందర్యం నన్ను పిచ్చివాణ్ణిగా చేస్తోంది. నడకలోని ఆ విలాసం, సౌవర్ణ ప్రభనుమించే ఆ తనూసౌకుమార్యం నన్ను వెర్రివాణ్ణిగా చేస్తున్నాయి ఆమెకోసం అమాంతం నిప్పులలోకి ఉరకమంటే నేను సిద్ధం. కాలిపోయిన నా దేహానికి ఆమె చేలాంచలముల కొస విసరుల తూరు పులు తగిలితే నాలో ప్రాణం ప్రసరించగలదని

గుమాస్తా (జవానుతో):- ఏమిటోయి ఈ రోజు ఇంతగా చినిగిపోయిన చొక్కా ధరించావెందుకు?

జవాను:- ఈ రోజు మన పై ఆఫీసర్లు తనిఖీకు వస్తారటగదండీ!

కొల్లా వెంకటేశ్వరరావు (గుంటూరు)

పిస్తోంది. ఆమె నా హృదయరాణి నా ప్రేమ పాశాలకు బోణి మాంచి కవిత్వం రాసెయ్యాలనుంది నాకు

నేను విధాత నామె వాణి
నేను శర్వుడ నామె శర్వాణి
నే నింద్రుడ నామె యింద్రాణి
నేను మధు నామె సుధారాణి''

"ఒరే! నీ పైత్యం చాలించి ముందు నీ ప్రేమ లేఖ గొడవ చూసుకో దాన్ని తీసికెళ్ళి ఆమె ప్రిన్సి పాలు కిచ్చిందంటే నీ రోగం చప్పగా కుదుర్తుంది!'' అని వెంకట్రావు హెచ్చరించాడు మధు వెంటనే "సరే పద'' అని అతడివెంట నడిచాడు.

ఇద్దరూ ప్రసాదరావు రూము కెళ్ళారు ప్రసాద్ మంచంలో పడుకొని మిదికిచూస్తూ సిగరెట్టు కాలుస్తున్నాడు

"నమస్కారం, బ్రదర్ ప్రసాద్'' అన్నాడు వెంకట్రావు

"నమస్కారంరా!'' అన్నాడు ప్రసాద్ తల తిప్పకుండానే "పనిమీదే వచ్చినట్టున్నారే!'' వచ్చిన యిద్దరూ కుర్చీల్లో కూలబడ్డారు. వెంకట్రావు చెప్పాడు · "బాగా వూహించావు బ్రదర్!! పని మీద వచ్చామంటావా? అది సఫలం కావాలనే వచ్చాం. అందుకే నీకు నమస్కారం కూడా కొట్టాం. నమస్కారం కొట్టందే పని సఫలంకాదని శాస్త్ర గ్రంథాల్లో రాశారటలే!''

"జానాను! నేనూ విన్నాను ఇంతకీ మీ "మస్కా' ఎందుకు?''

"మన రామ్మూర్తితో చిన్నపనిబడింది. నీ సాయంకోసం ''

"వాడితో ఏం పని ?''

"వాడిదగ్గరుండే ఒక వస్తువు మాకు కావాలి అది మాదే అనుకో అయినా ఇప్పుడది వాడి చేతిలో వుంది ''

"మీ వస్తువన్న మాటేమిటి? ఒకసారి వాడు కాఫీతాగి . . '' ప్రసాద్ ఆగి మళ్లీ సర్దు కున్నాడు. ఐమీన్ మీ వస్తువయినా, వాడి చేతులో పడిందంటే తిరిగి రావడంకల్ల'' నిక్కచ్చిగా చెప్పే శాడు

"అలాగంటే ఎలాభాయ్? వో ముఖ్యమైన కవరు వాడిచేతిలో చిక్కుకుంది ఎలాగైనా నీవు సాయం చేయాలి! లేకుంటే చచ్చామన్నమాటే!''

"నాకూ చేయాలనేవుంది కాని రామ్మూర్తి సంగతి నువ్వెరగవు!''

"నీవే ఏదో ఉపాయం చెప్పాలి ''

ప్రసాద్ కాసేపు పై కప్పువంకచూసి, తర్వాత అన్నాడు "నాకొక్కటేమార్గం కనబడుతోంది''

"చెప్పరాబాబూ! నీకు పుట్టెడు పుణ్యము స్తుంది'' అన్నాడు వెంకట్రావు

"ఆ కవరు ముఖ్యమైనదా?''

"ముఖ్యమేమిటి? మన ఫ్యూచరంతా దాంటోనే వుంది!'' ప్రసాద్ మళ్ళీ కాసేపు వూరుకున్నాడు. తర్వాత "సరే, అయితే! నా దగ్గరో బ్రహ్మాస్త్ర ముంది! అది మీకు ఉపదేశిస్తాను'' అన్నాడు.

"థాంక్యూ, బ్రదర్! థాంక్యూ'' వెంకట్రావు సంతోషపడిపోయాడు

"ఒక్కషరతు'' నిరుద్వేగంగా ప్రసాద్ అన్నాడు. "దానిలోని రహస్యంమాత్రం అడుగరాదు ''

"ఎందుకడుగుతాను బ్రదర్! మాక్కావలసింది నీ మంత్రం''

"సరే ! ముందు నీ కవరు ఇచ్చెయ్యమని వాడిని మర్యాదగా అడుగు వాడసలు ఇవ్వడులే! అప్పుడు "దీపక్‌మహల్లో జరిగిన సంగతి నాకు తెలుసు'' అను వెంటనే వాడు నీకు నీ కవర్ని ఇచ్చేస్తాడు ''

"వెరీగుడ్! అల్లావుద్దీన్ అద్భుతదీపం అన్న మాట "దీపక్ మహల్లో జరిగిన సంగతి" వెరీ గుడ్! దీపక్‌మహల్ అంటే సినిమాటాకీస్‌కదూ!''

"అదే లీలామహల్ ప్రక్కనుండేది'' అన్నాడు మధు

"తెలుసులేరా! వాణిమహల్‌కెళ్లే దారిలోదేగా!'' అన్నాడు వెంకట్రావు "బావుంది బ్రదర్ నీ మంత్రం అథాతో బ్రహ్మజిజ్ఞాసా అంటే దీపక్ మహల్లో ఏం జరిగిందో తెలుసు అని అర్థం. ఇంతకూ ఏంజరిగింది దీపక్‌మహల్లో?''

"అడగొద్దన్నాగా! ఎక్కువ తెలుసుకోడానికి ప్రయత్నించకు!'' గంభీరంగా నవ్వాడు ప్రసాదరావు.

"కార్యసాధనకు పితాళభైరవివంటిది. వాడిదగ్గర చిక్కుపడిన కవరు తెచ్చుకోడానికి ఆలీబాబా నేర్చుకున్న "హోపెన్‌సెసేమ్" వంటిది ఉపయోగించుకుంటే లాభం చేకూరుతుంది వెళ్ళిరా!' అన్నాడు

"అలాగే బ్రదర్! థాంక్యూ! మెనీథాంక్స్. నమస్కారం"

"నమస్కారం!"

*　　*　　*

మిత్రులిద్దరూ రామ్మూర్తి గదివేపు నడిచారు గదింకా అల్లంతదూరంలో వుండగానే వెంకట్రావు చిటికెవేసి "నాకో అయిడియా తట్టింది" అన్నాడు

"ఏమిటది?" అనడిగాడు మధుసూదనరావు యాంత్రికంగా. వెంకట్‌కి అయిదు నిమిషాలకొకటి చొప్పున అయిడియాలు తడుతూనేవుంటయ్. అంచేత అవి వినడం మధుసూదన్‌కి అలవాటయిపోయింది.

"మనం ప్రసాద్ చెప్పిన అస్త్రాన్ని ఉపయోగించాల్సిన అవసరమే లేదు"

"కారణం?"

"వాడిప్పుడు బీచ్‌కి వెళ్ళివుం[illegible]"

"వెళ్తే కాసేపట్లో తిరిగి వస్తాడు."

"కాదులే నీకు తెలియదు సిటీబస్సుకి అణన్నర ఎందుకివ్వాలని నడిచే వస్తాడు. వాడొచ్చేసరికి రాత్రి తొమ్మిదిదవుతుంది"

"అయితే ఇప్పుడు వాడి రూముకెళ్తే లాభమేమిటి?"

"ఇప్పుడే లాభం ఏ వస్తువు సంపాదించదలచినప్పుడు మోసం చేసైనా సంపాదించాలి"

"మరి నేను?" అనడిగాడు మధు

"నీవూ నాతోనే రా!" అన్నాడు వెంకట్రావు ఎడంచేతివేపు తిరుగుతూ

"బాబోయ్! నేను రాను!" అని మధు అక్కడే ఆగిపోయాడు.

"హోరి వెధవాయ్! జీవితంలో నీవెలా ప్రొస్పర్ అవుతావో నాకు తెలీకుండావుంది. సరే! నీవలా వెళ్ళి నేచురల్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌దగ్గర వుండు. పని ముగించుకుని పావుగంటలో వస్తాను" అని వెంకట్రావు హుషారుగా ముందుకు నడిచాడు.

వెంకట్రావు రామ్మూర్తి గది దగ్గరకు వచ్చాడు సరిగా కిటికీలో చేయిపెట్టి ఏ గుప్త ప్రదేశంలోనుండి తాళంచెవిని తీశాడు ఆ రూంలో ముగ్గురుంటున్నారు. తాళంచెవి ఒకటే వుండడంవల్ల ఎవరెప్పుడొచ్చినా తలుపు తెరుచుకోవడానికి వీలుగా దాన్ని ఏ స్థలంలో దాచారు. వెంకట్రావుకి ఈ సంగతులన్నీ తెలుసు అతడు గది తలుపులు తెరిచి చొరవగా లోపలికి ప్రవేశించాడు. అన్ని మూలలా పుస్తకంకోసం త్వర త్వరగా వెతికాడు కాని అది కనిపించలేదు. వెళ్ళిపోదామనుకుంటుండగా టేబిల్ మీద అతడికొక సినిమా పత్రిక కనిపించింది. దాన్ని అందుకుని కుర్చీలో కూర్చున్నాడు.

బూట్లచప్పుడు విని వెంకట్రావు చెవొల్లలేచి వింటున్నాడు. ముప్పావుగంట గడిచిపోయిన సంగతే తెలియదతనికి మరుక్షణంలో రామ్మూర్తి గదిలోకి ప్రవేశించాడు.

వెంకట్రావు అతడి కళ్ళలోకి అనుమానంగా చూశాడు.

రామ్మూర్తి అతడి మొహంలోకి కోపంగా చూశాడు.

వెంకట్రావు ఆశ్చర్యపోయాడు.

రామ్మూర్తి విస్తుపోయాడు.

"అప్పుడే వచ్చేశావేం?" అనడిగాడు వెంకట్రావు అప్రయత్నంగా.

"ఈరోజు. . . . ." అని రామ్మూర్తి ఏదో చెప్పబోయి తమాయించుకుని "నువ్వు మా రూంలో కెలావచ్చావ్" అనడిగాడు.

"సర్దాకి నిన్ను చూద్దామని వచ్చాను మనిద్దరం భాయ్ భాయ్ కదూ!"

"భాయ్ భాయ్ అయితే దురాక్రమణ ఎందుకు చేశావ్?"

"నీ కుర్చీలో కూర్చోవడం దురాక్రమణా?"

"తలుపుతెరుచుకొని లోపలికి రావడం దురాక్రమణకాదూ?"

---

మల్లయ్య:- ఇంత పెద్ద పట్నంలో యిన్ని దుకాణాలున్నాయి కాని నాకు కావలసింది ఒకచోట దొరకలేదు.

స్వామి:- ఏమిటది.

మల్లయ్య:- "అరువు"

డి. బ్రహ్మానందరెడ్డి (చీరాల)

---

"అరేభాయ్! నే వచ్చేసరికి తలుపులు వేసివున్నయ్. నువ్వు త్వరలోనే వస్తావుకదా అని తలుపు తెరుచుకుని లోపల కూర్చున్నాను. ఇది తప్పా?"

"నాకేం నచ్చలా! ఇంతకీ నీకు నాతో ఏంపని?" అని మీదికొచ్చినట్టు అడిగాడు రామ్మూర్తి.

"సరదాగా మాటాడదామని. . . ."

"చెప్పు! ఏం పని?" మరింత మీదికొచ్చినట్టు అడిగాడు.

"చెబుతున్నాగా ! పనేం . . ."

"బలుసాకు తినదలచుకుంటే నిజం చెప్పు ఏమిటి నీ అభిప్రాయం?" భయంకరమైన భూతం కదిలి ముందుకొస్తున్నట్టు వచ్చాడు రామ్మూర్తి. వెంకట్రావు విలవిల్లాడిపోయాడు గొంతెండిపోయింది ఎలాగో కష్టపడి" 'వాణిమహల్లో జరిగింది నాకు తెలుసు" అనగల్గాడు

"వాణిమహలట! వాణిమహల్!!" వికటంగా నవ్వాడు రామ్మూర్తి. వెంకట్రావు ఆశ్చర్యపోయాడు బ్రహ్మాస్త్రం పనిచేయనందుకు తీక్షణంగా ఆలోచించాడు. ఈసారి అతడి మనసుకు వరైన మంత్రం స్ఫురించింది.

"నాకుతెలుసు లీలామహల్లో ఏం జరిగిందో" అన్నాడు.

"గదిలోకి ఎందుకొచ్చావురా అంటే చవాకులు వాగుతున్నాడు!" రామూర్తి స్వగతంగా మరింత దగ్గరకువస్తూ. మెల్లగా వాడిచేయి మీదికిపోతోంది. వెంకట్రావు భయంతో కళ్ళుమూసుకుని గట్టిగా అరిచాడు. "దీపక్‌మహల్లో జరిగిందంతా నాకు తెలుసు!"

అంతే! ఆ చేయి అలా ఆగిపోయింది మెల్లగా క్రిందికిజారిపోయింది కూడా.

"తెలుసు, నాకంతా తెలుసు!" అన్నాడు మెల్లగా వెంకట్రావు. "ఏంతెలుసు?" అని అడుగుతాడేమోనని భయపడ్డాడు కూడా.

రామ్మూర్తి దగ్గరికివచ్చి వెంకట్రావు చేతులు పట్టుకున్నాడు. "బాబ్బాబు! ఎవ్వరితో చెప్పద్దురా! మనిద్దరం భాయ్‌భాయ్ ! నీకేం కావాలో చెప్పు చేస్తాను!" అన్నాడు

"నాకు చలం రాసిన "అమరావతి శిధిలాలు" అనే లైబ్రరీ పుస్తకం కావాలి" అన్నాడు వెంకట్రావు

"చలం అలాటి పుస్తకం రాయలేదురా!" అన్నాడు రామ్మూర్తి ఓపిగ్గా.

"అవునవును. అదికాదు "హంపీ శిధిలాలు" అనే పుస్తకం నువ్వివాళ లైబ్రరీనుండి తెచ్చావుగా! అది" అన్నాడు వెంకట్రావు.

"అది "హంపీ శిసిలాలు"కాదు "హంపీ కన్యలు". కాని ఆ పుస్తకం నా దగ్గరలేదు. కావాలంటే రేప్పొద్దున్నే తెచ్చిస్తా"

"అదెక్కడుంది?"

"సెకెండవరు దాన్ని లైబ్రరీలో తీసుకున్నాను. అట్టఅయినా విప్పిచూడలేదు పట్టుకొస్తూంటే కెమిస్ట్రీ స్టూడెంటు సుధారాణి, నే చదివిస్తానని తీసికెళ్ళింది. నీకు కావాలంటే ఉదయాన్నే వెళ్ళి తీసుకొస్తాను అత్యవసరమయితే ఇప్పుడే తెస్తాను"

"వద్దులేరా భాయ్! నీకాశ్రమ ఎందుకు? నాకాపుస్తకమేవద్దు తమాషికి అడిగాను. అంతే. వస్తా. టా! టా!!" అని వెంకట్రావు వెనుతిరిగి నడిచాడు

"ఒరే వెంకట్! ఎవరితోనూ. . . .

"భయపడకోయ్! ఒక్కపిట్టకయిన తెలీదనుకో! వస్తా బైబై!!" అని వెళ్ళిపోయాడు.

వెంకట్రావు విసవిసా నడుచుకుంటూ నాచురల్ సైన్స్‌లాబ్ దగ్గరకు వచ్చాడు. మధుసూదనరావు అతడికోసం విసుగ్గా ఎదురుచూస్తున్నాడు.

"ఏంరా! ఇన్ని యుగాలయిందేం? అని అడిగాడు ఓపిక చంపేసుకుని.

"వీరాశ్ట విరిగి నేతిలో పడిందిరా బ్రదరూ!" అన్నాడు వెంకట్రావు

మధు కర్థంకాలా "అంటే?" అని ప్రశ్నించాడు

"నీ మొదటిప్రేమలేఖ గమ్యస్థానం చేరింది"

"అంటే ?"

"అంతే!" అని వెంకట్రావు క్లుప్తంగా పరిస్థితిని విశదీకరించాడు.

(42 వ పేజీ చూడండి)

# జామ్-బక్

## పాదముల వాపు నొప్పిని శమనపర్చి నివారించును

కాళ్లవాపులు, వ్రణములు, కురుపులు, కాలిపగుళ్లు విషగాయములు, జామ్-బక్ గొప్ప చర్మ ఆయింట్మెంటుతో త్వరలో మానును జామ్-బక్ చర్మంలోకి పోయి, గుణమిచ్చే ఔషధము దీనిలో జంతు క్రొవ్వులు నూనెలు లేవని గ్యారంటీ చేయబడినది.

**Zam-Buk**
జామ్-బక్
మూలికా బామ్



ఇది మందుల వ్యాపారు లందరివద్దను దొరుకును.
సి ఇ పుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
బొంబాయి

సోల్ ఏజంట్లు. దాదా & కంపెనీ,
86, సైనప్పనాయక వీధి, మద్రాసు-3.

---

**'కోరింత దగ్గుమందు' లార్క్-సిల్డ్.**

హోమియోపతీ, ఏలోపతీ, ఆయుర్వేదవైద్యులు ప్రస్తుతపు మందు లన్నిటికంటె మిన్నగా పని చేయునదిగా నెన్నుకొనుచున్నారు ఈ మందు కోరింత దగ్గును అద్భుతముగా నివారణ చేయుచున్నది. సీసా (28 బిళ్లలు) రు 1-80. టోకున కొనువారికి, విక్రయదారులకు ప్రత్యేక ధరలు

Dr Lanka RamakrishnaaoR
Lark Homoeo Clinic
Srikakulam A. P
(దీర్ఘవ్యాధి చికిత్సా నిపుణులు)

---

**శ్రీబాలాంజనేయ ప్రశ్న**

సంతానము, రోగములు, గ్రహబాధలు, వివాహం, పారిపోయిన పశువులు, మనుష్యులయొక్క ఆచూకీ, దొంగిలింపబడిన సొమ్ము, వీడిపోయినభార్య మీరు కోరిన 5 ప్రశ్నలకు వెంటనే వ్రాసి పంపగలను. రూ 2 ఎం.ఓ. చేయండి. నెలలవారీగా 12 నెలలకు 1 సంవత్సరం జాతకము రూ 2. పూర్తిపేరు, జాబువ్రాసిన టైము తెలిపిన చాలును.

**హనుమాన్ జ్యోతిషాలయము,**
10వ లైను, అరండల్ పేట, గుంటూరు2


(40-వ పేజీ తరువాయి)

"మరి మన కర్తవ్యం"

"అదీ ఆలోచించాను. చెబుతా విను. సుధారాణి రోజూ కాలేజినుండి ఇంటికెళ్లేటప్పటికి రాత్రి ఎనిమిదిన్నర అవుతుంది. రోజూ రామారావ్‌స్ట్రీట్ వెంబడే వెళ్తుంది. ఈరోజురాత్రి నీవు దారికాసి ఆమెతో మాటాడేసి బిసాసైసా తేల్చేసుకో. నే నింతలో రెండో ప్రేమలేఖ సంగతి చూస్తాను"

"ఎలా మాటాడాలిరా ! వణుకుగావుంటుం దేమో!" అన్నాడు మధు.

"అమాత్రం మాటాడలేని వెధవాయివి ప్రేమలేఖ ఎలా వ్రాశావు? ఏం భయంలేదు దారిలో నిలబడి "సుధారాణీ!" అని పిలు "హోయ్" అంటుందికదూ! "హంపీయాత్ర"లో వుండే నా కవరు తిరిగి ఇచ్చెయ్యండి అను. ఆ సంగతి తెలిసిపోతుంది! వెళ్లు త్వరగా! నాకూ అర్జంటు పనుంది" అని మధుని వెంకట్రావు తరిమాడు.

* * *

మధు వీధిలైటు క్రీనీడపడేచోట నించున్నాడు వీధిలో ఏ సందడీలేదు కాని దూరంగా విద్యుద్దీప కాంతిలో తళతళ తారురోడ్డు మెరిసిపోతోంది ఆకాశంలో మినుకు మినుకుమనే నక్షత్రాలు, ఉత్సాహజనకమయిన గాలి, మనోహరమైన వాతావరణం. మేజర్ టిటోవ్, వోస్టాక్‌లో కూర్చున్నంత ఆనందంగా వుంది.

దూరంగా వో ఆకారం కదులాడింది మసక నీడలోంచి మధు కళ్ళు చించుకుని చూశాడు సందేహంలేదు. అది స్త్రీ ఆకారమే అతడి గుండె జనతా ఎక్స్‌ప్రెస్‌తో పోటీ చేయడం ప్రారంభించింది ఆ ఆకారం క్రమేపీ దగ్గరవడుతూ వచ్చింది మధు ఆమెను పోల్చుకున్నాడు ఆ రెండు జడలూ, రాయంచలను జయించినట్టి ఆ నడకలోని వయ్యారం అతడి గుండెవేగం హెచ్చించి గ్రాండ్‌ట్రంక్ వేగాన్ని అందుకునేలా చేసింది ఆమె పది గజాలదూరంలో వుండనగా అతడి గుండె చిన్నసైజు అమెరికన్ రాకెట్టుతో సమానంగా పరిగెత్తింది

ఆమెను కాస్త దగ్గరగా రానిచ్చి "సుధా" అని మధురంగా పిలిచాడు మధు. కాని ఆ భయంలో అతని నోటిలోంచి విచిత్రమైన ధ్వనితప్ప స్పష్టమైన శబ్దం బయటికి రాలేదు

"వా. . . క్" అని అరిచింది సుధారాణి అరవడమేమిటి ఒక్క ఉదుటున ఆమె ఎగిరి త్రుళ్లి పడింది ఆమె చేతిలోని సుమారు ఇరవైపుస్తకాలూ నేలపడి పోయాయి.

మగపక్షి ప్రేమకూజితానికి ఏ ఆడపక్షిఅయినా "వా. . . క్" అని జవాబిస్తుందో లేదో తెలీదు మానవ భాషలోమాత్రం ఈ ప్రయోగం అపూర్వం బహుశా ఆమె "వాట్" అనబోయి "వా . క్" అని అరచివుంటుందేమోనని వూహించవచ్చు

"ఏంసుధా!! అంత భయపడిపోయారేం?" అని అడిగాడు మధు

ఆమె "మీరా మధుగారూ!! ఎంత భయపెట్టారండీ!!" అన్నది

"క్షమించండి! మీతో పనుండి మాటాడుదామని వచ్చాను" అన్నాడు మధు.

"నేనూ మీతో వో విషయం చెబుదామనుకుంటున్నాను"

"చలంపుస్తకంలో కవరు . . ."

"దానిలోని ప్రేమలేఖ . . . ."

"క్షమించండి . . ."

"నేను దాన్ని చదివేశాను"

"నిజంగానా?"

"ఔనండి! నా జవాబు వింటారా!"

"వోయస్!!"

"నా జవాబు కూడా అదే !"

"సుధా!"

"మధూ!"

"నిజంగా !?"

"నిజమే!"

"సుధా ! మిమ్మల్ని కాలేజీలో చూసిన మొదటి రోజునే ప్రేమించాను"

"సరిగ్గా చెప్పారు అగస్టు 15 వ తేదీకదూ! మీరు లిటరరీ అసోసియేషన్‌లో ఇంగ్లీషులో ఉపన్యాసం యిచ్చినరోజు!!"

"సుధా నేనెంతో అదృష్టవంతుణ్ణి!!"

"ఊహూం! నేను!!"

ఈ రకంగా చాలాసేపు సంభాషణ జరిగింది. అయితే దానితో మనకంతగా అవసరంలేదు కాబట్టి అక్కడితో దాన్ని వదిలేద్దాం ఇది తర్వాతి రంగం.

* * *

మధుసూదనరావు వెంకట్రావును గట్టిగా కావలించుకున్నాడు "ఒరే బదర్! నేను సుధారాణిని వివాహం చేసుకోబోతున్నారా!" అన్నాడు.

"కంగ్రాచ్యులేషన్స్ మై బోయ్! నే చెప్పాగా! యూ విల్లో ఫారిన్ది వరల్డ్!!"

"నీకెలా థాంక్స్ చెప్పాలో తెలీకుండా వుందిరా! నీకు నేనెంతో ఋణపడివున్నాను"

"నో థాంక్సు! స్నేహితానికి ఋణమేవిట్రా?"

"మరి ఆ రెండో ప్రేమలేఖ ఏమైందిరా?"

"ఏమో! దాని గురించి ఏమీ నిర్ధారణగా తెలీదు అనేకమైన అభిప్రాయాలున్నాయి. కాని దేనికీ సరైన ఋజువులేదు ఋజువు దొరగ్గానే చెబుతాలే! అయినా నీ విప్పుడు దాని గురించి భయపడాల్సిన అవసరమేముంది? ఎలాగా సుధారాణిని వివాహమాడబోతున్నావుగా!"

"వెరీగుడ్! వస్తానురా!! బైబై! మళ్ళీ కలుస్తాను చాలా థాంక్స్" అని మధు వెనక్కి తిరిగాడు.

"ఒరేయ్! ఇది విని వెళ్ళు! ఆ లీలామహల్లో ఏం జరిగిందో తెలుసా?" అని వెంకట్రావు పిలిచాడు

"ఏ లీలామహలూ?"

"అదే రామ్మూర్తిగాడిమీద ప్రయోగించిన బ్రహ్మాస్త్రంమాట!"

"అది లీలామహల్ కాదురా, దీపక్‌మహల్"

"వో సారీ! ఆ దీపక్ మహల్లో ఈ రామ్మూర్తిగాడు ఇంటర్వెల్లో కాఫీతాగి ఎవరూ చూడ్డంలేదనుకుని ఆ గ్లాసును జేబీలో పెట్టుకొని తీసుకొని వచ్చాడట అది ప్రసాద్ చూశాడట ఇప్పుడే వాడిచేత ఈమాట చెప్పించాను."

"అందుకే అందరికీ తెలుస్తుందని వాడంత బాధపడ్డాడు పాపం! పూర్‌ఫెలో!! వస్తాన్రా! గుడ్‌బై!!"

"గుడ్‌బై"

★